క్లుప్తంగా

భానుప్రసాద్‌కు పరామర్శ


భానుప్రసాద్‌ను పరామర్శిస్తున్న గిరజాల బాబు

ధవళేశ్వరం: శస్త్రచికిత్స చేయించుకుని ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్న వైఎస్సార్ సీపీ నాయకుడు పందెళ్ల భానుప్రసాద్‌ను బుధవారం వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి గిరజాల బాబు పరామర్శించారు. ఈ సందర్భంగా భానుప్రసాద్ ఆరోగ్య పరిస్థితిని బాబు అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట వైఎస్సార్ సీపీ నాయకులు గారపాటి వీర్రాజు, పున్నమిరాజు వీర్రాజు తదితరులు ఉన్నారు.

కనకదుర్గమ్మకు ప్రత్యేక పూజలు


మోరంపూడిలో మహిషాసుర మర్దినిగా విజయ కనకదుర్గాదేవి అమ్మవారు

రాజమహేంద్రవరం రూరల్: దసరా శరన్నవ రాత్ర మహోత్సవాల్లో భాగంగా పదో రోజు బుధవారం మోరంపూడి సాయినగర్‌లోని శ్రీవిజయ కనకదుర్గాదేవి ఆలయంలో అమ్మవారిని శ్రీమహిషాసురమర్దిని దేవిగా అలంకరించినట్లు ఆలయ ధర్మకర్త మేడి త్రిమూర్తులు తెలిపారు. ఉదయం నుంచి అమ్మవారికి కుంకుమ పూజలు చేశారు. బాలాజీపేట సెంటర్‌లోని విజయ కనకదుర్గాదేవి ఆలయంలో అమ్మవారు మహిషాసుర మర్దినిగా దర్శనమిచ్చారు.

బీఎస్ఎన్ఎల్ సేవలకు 25 ఏళ్లు పూర్తి


సమావేశంలో మాట్లాడుతున్న బీఎస్ఎన్ఎల్ జీఎం రాజు

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): బీఎస్ఎన్ఎల్ సేవలు 25 ఏళ్లు పూర్తి చేసుకుని, 26వ వసంతంలోకి అడుగు అడుగిడుతున్నాయని ప్రిన్సిపల్ జనరల్ మేనేజర్ పలివెల రాజు అన్నారు. స్థానిక గోకవరం బస్టాండ్ వద్ద ఉన్న బీఎస్ఎన్ఎల్ కార్యాలయంలో బుధవారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. తొలుత గోకవరం బస్టాండ్ నుంచి కోటిపల్లి బస్టాండ్ వరకు ఉద్యోగులు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పలివెల రాజు మాట్లాడుతూ మాతృ సంస్థ అయిన టెలికం నుంచి బీఎస్ఎన్ఎల్ విడిపోయి నేటికి 25 ఏళ్ల పూర్తయ్యిందన్నారు. ఈ సంస్థ ప్రస్తుతం ఉన్న మార్కెటింగ్‌లో ప్రత్యర్థుల ఆటుపోట్లు తట్టుకుంటూ ముందుకు వచ్చిందని అన్నారు. ప్రత్యర్థులు టెలికం సేవలను ఇతర దేశాల నుంచి తెచ్చుకుంటున్నాయన్నారు. ఈ నెల 27న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ బీఎస్ఎన్ఎల్ 4జీ సేవలను జాతికి అంకితం చేశారన్నారు. సీహెచ్ వీవీ సత్యనారాయణ, వై.శైలజ, పమ్మిడి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

అత్యంత అవినీతి ఎమ్మెల్యే ఆదిరెడ్డి

- ప్రతి శాఖ నుంచి కమీషన్లు వసూళ్లు
- మాజీ ఎంపీ భరత్‌రామ్ ధ్వజం


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మార్గాని భరత్‌రామ్

రాజమహేంద్రవరం సిటీ: రాష్ట్రంలో అత్యంత అవినీతి ఎమ్మెల్యేగా నగర ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ మొదటి వరుసలో నిలుస్తారని, తన అనుచరులతో కలసి ప్రతి పనికీ కమీషన్లు తీసుకుంటున్నారని మాజీ ఎంపీ, వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి మార్గాని భరత్‌రామ్ ధ్వజమెత్తారు. బుధవారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నగరంలో 10, 15 అడుగుల నిడివి గల వీధుల్లో బహుళ అంతస్తుల భవన నిర్మాణాలు జరుగుతున్నాయని, దానికి ఎమ్మెల్యే అండ దండలున్నాయని అన్నారు. అనుమతి ఇచ్చిన దానికంటే అదనపు అంతస్తులు నిర్మిస్తున్నారన్నారు. నగరంలోని అన్ని వార్డుల్లో టీడీపీ వార్డు ఇన్‌చార్జులు రూ.లక్షలకు లక్షలు అదనపు ఫ్లోర్‌ల కోసం బహిరంగంగా వసూలు చేస్తున్నారని ఆరోపించారు. నిబంధనలకు విరుద్ధంగా నిర్మిస్తున్న వాటికి ఒక్క నోటీసు కూడా వెళ్లలేదని, ఆన్‌లైన్‌లో చూస్తే తెలుస్తుందన్నారు. ఇంత పెద్ద నగరానికి మున్సిపల్ కమిషనర్‌ను వేసుకోలేని దౌర్భాగ్య పరిస్థితి నెలకొందన్నారు. నగరంలో ప్రతి శాఖలో ఎమ్మెల్యే మనుషులు తిష్ట వేసుకుని కూర్చుంటున్నారన్నారు. అక్కడున్న వ్యక్తులు కమీషన్లు వసూలు చేస్తున్నారని అన్నారు. నిబంధనల ప్రకారం అనుమతులు రాకపోతే ఎవరూ లంచాలు ఇవ్వొద్దని, అవసరమైతే మీ తరఫున పోరాడతానని భవన నిర్మాణ దరఖాస్తుదారులకు భరత్‌రామ్ విజ్ఞప్తి చేశారు. గడిచిన మూడు, నాలుగు నెలల్లో 189 మందికి అనుమతులు ఇవ్వలేదని తెలుస్తోందన్నారు. అధికారులు ఎం బుక్‌లు సిద్ధంగా పెట్టుకోండి.. జగనన్న ప్రభుత్వం రాబోతోంది.. ఏ ఒక్క ఎం బుక్కు మిస్సవ్వకుండా చూడండి, అన్నీ పరిశీలిస్తామని అన్నారు. నగరంలో చేసే అభివృద్ధి పనుల్లో నాణ్యత కరవవుతుందని, నామినేషన్ పనులు తక్షణం ఆపాలని ఆయన డిమాండ్ చేశారు. గౌతమీ సూపర్ బజార్ విషయంలో అప్పట్లో దుష్ప్రచారం చేశారని, అక్కడ ఇప్పుడు నిర్మాణం జరుగుతుంటే ఎమ్మెల్యే ఏం చేస్తున్నారో తెలియడం లేదన్నారు. అనధికారికంగా మూడు, నాలుగు అంతస్తులు అక్కడ వేస్తున్నారన్నారు. పలు కీలక ప్రాంతాల్లో హోర్డింగ్స్ పెడుతున్నారని, అసలు పర్మిషన్లు ఎవరిచ్చారన్నారు. ప్రభుత్వం రూపొందించిన మద్యం పాలసీకి విరుద్ధంగా ఎమ్మార్పీ కంటే అదనపు రేట్లకు మద్యం విక్రయాలు చేస్తుంటే, ప్రభుత్వం ఏం చేస్తోందని ధ్వజమెత్తారు. మద్యం ఎమ్మార్పీ కంటే ఒక్క రూపాయి ఎక్కువకు అమ్మినా ఊరుకునేదిలేదని అన్నారు. కార్యకర్తలతో కలసి వైన్ షాపుల వద్ద ధర్నాకు దిగుతామని ఆయన హెచ్చరించారు. ఇంత బహిరంగంగా ఎక్కువ ధరలకు అమ్ముతుంటే అధికారులు ఏం చేస్తున్నారో తెలియడం లేదన్నారు. ఇది కాకుండా నిబంధనలకు విరుద్ధంగా జాతీయ రహదారులపై కొత్త షాపులు తెరుస్తున్నారని ధ్వజమెత్తారు. ఎంపీ మిథున్‌రెడ్డిపై కేవలం కక్ష సాధింపులో భాగంగా అక్రమ కేసులు పెట్టారన్నారు. ఈ విషయం ప్రజలకు కూడా అర్థం అవుతోందన్నారు.

డిజిటల్ బుక్ ఆవిష్కరణ


డిజిటల్ బుక్‌ను ఆవిష్కరిస్తున్న మాజీ ఎంపీ మార్గాని భరత్‌రామ్

రాజమహేంద్రవరం సిటీ: కూటమి ప్రభుత్వంలో వైఎస్సార్ సీపీ శ్రేణులపై వేధింపులు అధికమయ్యాయని మాజీ ఎంపీ, వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి మార్గాని భరత్‌రామ్ అన్నారు. పార్టీ శ్రేణులపై చేస్తున్న నియంతృత్వ పోకడలను ఎప్పటికప్పుడు నమోదు చేయడానికి పార్టీ అధినేత, మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సూచన మేరకు డిజిటల్ బుక్‌ను ఆవిష్కరిస్తున్నట్లు తెలిపారు. బుధవారం స్థానిక మార్గాని ఎస్టేట్‌లోని వైఎస్సార్ సీపీ సిటీ కార్యాలయంలో ఆయన పార్టీ నాయకులు, శ్రేణులతో కలసి డిజిటల్ బుక్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా మహిళా అధ్యక్షురాలు మార్తి లక్ష్మి, నాయకులు కానుబోయిన సాగర్, మార్తి నాగేశ్వరరావు, గుర్రం గౌతమ్, దాసి వెంకట్రావు, సీరపు గణేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రక్తదానంతో ప్రాణరక్షణ

కంబాలచెరువు: జాతీయ స్వచ్ఛంద రక్తదాన దినోత్సవం సందర్భంగా స్థానిక ప్రభుత్వ ఆసుపత్రి వద్ద జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా రక్తదాన శిబిరాలు నిర్వహించారు. అనంతరం డీఎంహెచ్ఓ డాక్టర్ కె.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఒక రక్తపు చుక్క ప్రాణాలను కాపాడుతుందనే సందేశాన్ని ప్రతి ఒక్కరూ గుర్తుంచుకుని ఆ దిశగా అడుగులు వేయాలన్నారు. స్వచ్ఛంద రక్తదానం సమాజానికి అత్యంత పుణ్యకార్యమని, రక్తదానం చేసి ప్రాణాలను రక్షించడంలో భాగస్వాములు కావాలన్నారు. ప్రభుత్వ ఆసుపత్రి ఇన్‌చార్జ్ సూపరింటెండెంట్ డాక్టర్ బి.సౌభాగ్యలక్ష్మి, జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి పి.కోమల, డీఎస్ఎంఓ హారిక, బ్లడ్ బ్యాంక్ వైద్యాధికారులు పరమహంస, నజీర్, పారా మెడికల్ సిబ్బంది, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.



అలంకారంలో దర్శనమిస్తున్న అమ్మవారు

ఏటా అయ్యప్ప ఆలయంలో అన్నదానం

- 18 మంది ప్రముఖులతో కమిటీ
- శ్రీధర్మశాస్తా ఆధ్యాత్మిక సంస్థ ప్రతినిధుల వెల్లడి


సభలో మాట్లాడుతున్న శ్రీధర్మశాస్తా ఆధ్యాత్మిక సంస్థ నిర్వాహకురాలు జక్కంపూడి విజయలక్ష్మి

రాజహేంద్రవరం సిటీ: ఏటా మాదిరిగానే దసరా నుంచి సంక్రాంతి వరకూ స్థానిక అయ్యప్పస్వామి ఆలయంలో అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు శ్రీధర్మశాస్తా ఆధ్యాత్మిక సంస్థ ప్రతినిధులు వెల్లడించారు. బుధవారం అయ్యప్ప ఆలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీధర్మశాస్తా ఆధ్యాత్మిక సంస్థ నిర్వాహకురాలు జక్కంపూడి విజయలక్ష్మి మాట్లాడుతూ అన్నదాన కార్యక్రమానికి 18 మంది ప్రముఖులతో కమిటీని 2025-26 సంవత్సరానికి ఏర్పాటు చేసినట్లు తెలిపారు. దివంగత మంత్రి జక్కంపూడి రామ్మోహన్‌రావు గోదావరి తీరాన అయ్యప్ప ఆలయం నిర్మించడానికి సంకల్పించి ప్రముఖులతో కమిటీ వేసి, ఏడేళ్ల పాటు శ్రమించి వెయ్యేళ్లు నిలిచేలా పూర్తి చేయించారన్నారు. 2011 మార్చి 20న ఆలయం ప్రారంభించారని, అదే ఏడాది అక్టోబరు 6న అన్నదానం కూడా ప్రారంభించి అయ్యప్ప భక్తులకు ఏటా అన్నదానం జరగాలని సూచించారన్నారు. ధర్మకర్త చల్లా శంకరరావు మాట్లాడుతూ మాలధారణ చేసిన భక్తులకు ఇక్కడ నిత్యం అన్నదానం జరగాలన్న జక్కంపూడి సంకల్పం మేరకు అన్నదానం చేస్తున్నామన్నారు. వచ్చిన విరాళాలను ఫిక్స్‌డ్ డిపాజిట్ చేసి, దానిపై వచ్చే వడ్డీని కూడా డిపాజిట్ చేస్తున్నామన్నారు. ఆ విధంగా ఇప్పటికీ రూ.1.30 కోట్లు డిపాజిట్ చేశామన్నారు. ఏటా అన్నదానానికి తన వంతుగా మంతెన కేశవరాజు రూ.లక్ష మొదట విరాళం ఇస్తున్నారన్నారు. ధర్మకర్త పాలసానపల్లి హనుమంతరావు మాట్లాడుతూ ఏటా దసరా నుంచి సంక్రాంతి వరకు అయ్యప్ప, భవానీ, శివ భక్తులకు అన్నదానం నిర్వహిస్తున్నామన్నారు. మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా మాట్లాడుతూ తన తండ్రి జక్కంపూడి ఏడేళ్లు శ్రమించి అయ్యప్ప ఆలయ నిర్మాణం పూర్తి చేయడమే కాకుండా అన్నదానం కూడా జరగాలని భావించారన్నారు. రోజుకు సగటున వెయ్యి మంది చొప్పున వంద రోజుల్లో లక్ష మందికి పైగా భోజన వితరణ చేస్తున్నట్లు తెలిపారు. అన్నదాన కార్యక్రమం ఇంకా పక్కాగా జరగాలన్న ఉద్దేశంతో 2025-26 సంవత్సరానికి 18 మంది ప్రముఖులతో కమిటీ వేశామన్నారు. కమిటీ సభ్యులుగా టీటీడీ బోర్డు మెంబర్ అక్కిన మునికోటేశ్వరరావు, శ్రీఘాకోళ్లపు శివరామ సుబ్రహ్మణ్యం, డాక్టర్ గూడూరి శ్రీనివాస్, డాక్టర్ ఎస్. రామరాజు, కూర్మదాసు ప్రభాకర్, నందెపు శ్రీనివాస్, బూర్లగడ్డ సుబ్బారాయుడు, ఆకుల శ్రీనివాస్, అయ్యల గోపి, మన్యం సంతోష్ ఫణికుమార్, చింతా ఎన్వీ ఎస్ ప్రసాదరెడ్డి, ముద్రగడ రామ్‌ప్రకాష్, కొమ్ముల సత్యసాయి చక్రవర్తి, మదన్ పురోహిత్, కొత్తపల్లి బాలసుబ్రహ్మణ్యం, మన్యం ఎన్వీ నవీన్‌కుమార్, హనుమాన్ సింగ్‌రాజ్ పురోహిత్, బాలనాగు సుభాష్‌లతో కమిటీ ఏర్పాటు చేసినట్లు ఆయన వివరించారు. కార్యక్రమంలో ధర్మకర్తల మండలికి చెందిన మంతెన కేశవరాజు, దవులూరి రామకృష్ణ, ఇమంది మోహనరావు, బళ్ల సత్యనారాయణ, మన్నె సుబ్బారావు, చలగళ్ల సుబ్బారావు, వరదా మురళీధరరావు, చలపతి గురుస్వామి, బుడ్డిగ శ్రీనివాస్, ఆమంచి ఆంజనేయ గురుస్వామి, పంతం కొండలరావు, బైర్రాజు ప్రసాదరాజు, యాళ్ల సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్జీఓ నాయకుల పర్యటన విజయవంతం చేయండి


సమావేశంలో మాట్లాడుతున్న అనిల్‌కుమార్

రాజమహేంద్రవరం సిటీ: రాష్ట్ర ఎన్జీఓ సంఘ అధ్యక్ష, కార్యదర్శులు ఎ.విద్యాసాగర్, డీవీ రమణ ఈ నెల 8న రాజమహేంద్రవరం రానున్నారని, ఈ పర్యటనను విజయవంతం చేయాలని నగర ఎన్జీఓ సంఘ సమావేశం పిలుపునిచ్చింది. బుధవారం సంఘ నగర ఇన్‌చార్జి అధ్యక్షుడు పి.అనిల్ కుమార్ అధ్యక్షతన ఎన్జీఓ హోంలో సమావేశం నిర్వహించారు. నూతన జిల్లాల ఏర్పాటు నేపథ్యంలో తూర్పుగోదావరి జిల్లా ఏపీ ఎన్జీఓ సంఘ అడహక్ కమిటీని నియమిస్తారన్నారు. రాష్ట్ర అధ్యక్షుల బాధ్యత తీసుకున్న విద్యాసాగర్ తొలిసారిగా నగరానికి వస్తున్న సందర్భంగా ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్ల ర్యాలీ నిర్వహిస్తామన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయ న్యాయమైన డిమాండ్ల పరిష్కారం కోసం రాష్ట్ర జేఏసీ నిరంతరం కృషి చేస్తుందని రాష్ట్ర జేఏసీ కార్యదర్శి వేణుమాధవరావు అన్నారు. రాష్ట్ర జేఏసీ నాయకుల పర్యటనను విజయవంతం చేయాలని నగర ఎన్జీఓ సంఘ కార్యదర్శి ప్రవీణ్ కుమార్ అన్నారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి నిరంతరం పోరాడేది ఏపీ ఎన్జీఓ సంఘం ఒకటేనని మహిళా సంఘ చైర్మన్ సత్యవతి అన్నారు. ఎన్జీఓ సంఘ ప్రతినిధులు రాఘవరావు, ఆనంద్, సత్యమూర్తి, వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

సినిమాలు



శ్యామల: కిష్కింధపురి
సూర్యమినీ: అవతార్, సన్నీ సంస్కారికి తులసీకుమారి
సూర్యప్యాలెస్: కాంతారా-1
స్వామి: ఓజీ
అనుశ్రీ: ఓజీ
శివజ్యోతి: ఓజీ
రాజా: ఓజీ
ఊర్వశి: కాంతారా-1
మేనక: ఇడ్లీకొట్టు
రంభ: మిరాయ్
అప్సర: కాంతారా-1
అశోక: ఇడ్లీకొట్టు
నామవరం:
మీఎస్ మహల్: మిరాయ్
ధవళేశ్వరం:
మురళీకృష్ణ: కాంతారా-1, ఓజీ
కడియం:
వెంకటసూర్య: ఓజీ

స్వదేశీ స్ఫూర్తి నింపడానికే ఖాదీ సంత

రాజహేంద్రవరం సిటీ: స్వాతంత్ర్య పోరాటంలో స్వదేశీ నినాదం గట్టిగా పనిచేసిందని, ఇప్పుడు వికసిత్ భారత్ కోసం స్వదేశీ స్ఫూర్తిని ప్రజల్లోకి తీసుకెళ్తున్నామని బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యులు, ఎమ్మెల్సీ సోము వీర్రాజు తెలిపారు. బుధవారం స్థానిక బీజేపీ కార్యాలయంలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ స్థానిక సుబ్రహ్మణ్య మైదానంలో 2, 3వ తేదీల్లో ఖాదీ సంత పేరిట ఖాదీ ఉత్పత్తుల ప్రదర్శన నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అన్ని రంగాల్లో స్వదేశీ భావన రావాలన్నారు. ఖాదీ సంతను జయప్రదం చేయాలని కోరారు. దీనికి సంబంధించిన పోస్టర్లను పార్టీ జిల్లా అధ్యక్షుడు పిక్కి నాగేంద్ర, నాయకులు తపన చౌదరి, బొమ్ముల దత్తు, రొంగలి గోపి, అడబాల రామకృష్ణ, నర్సిపల్లి హారిక, తపనా చౌదరి, క్షత్రియ బాలసుబ్రహ్మణ్యం సింగ్ తదితరులతో కలసి ఆవిష్కరించారు.

పీహెచ్‌సీ వైద్యుల నిరసన ర్యాలీ



డీఎంహెచ్ఓ కార్యాలయం నుంచి ర్యాలీ చేస్తున్న పీహెచ్‌సీ వైద్యులు

రాజమహేంద్రవరం రూరల్: తమ న్యాయమైన డిమాండ్లను కూటమి ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని కోరుతూ జిల్లాలోని పీహెచ్‌సీ వైద్యులు బుధవారం బొమ్మూరులోని డీఎంఅండ్‌హెచ్ఓ కార్యాలయం నుంచి సెంటర్ వరకూ నిరసన ర్యాలీ నిర్వహించారు. ప్లకార్డులు చేతపట్టి నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఏపీ పీహెచ్‌సీ వైద్యుల అసోసియేషన్ నేతలు డాక్టర్లు సిరాజ్, భావన, తిరణ్ మాట్లాడుతూ ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించకపోతే ఆందోళన తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. పీహెచ్‌సీల్లో వైద్యాధికారులుగా పనిచేస్తున్న వారికి పీజీ సీట్లలో 30 శాతం కోటా ఉండేదన్నారు. దీనిని కూటమి ప్రభుత్వం 15 శాతానికి తగ్గించిందన్నారు. దీనిపై ఆందోళన చేస్తే 20 శాతానికి ప్రభుత్వం పెంచిందన్నారు. దానిని ఒక ఏడాది మాత్రమే అమలు చేసి ఇప్పుడు పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. 2020లో ఉద్యోగంలో చేరిన వైద్యులకు నోషనల్ ఇంక్రిమెంట్లు ఇవ్వడం లేదన్నారు. 20 ఏళ్ల నుంచి పనిచేస్తున్న వైద్యులకు ప్రమోషన్లు సైతం ఇవ్వకుండా ప్రభుత్వం తాత్సారం చేస్తుందన్నారు. తమ న్యాయమైన డిమాండ్లు అమలు చేసే వరకు ఆందోళన కొనసాగుతుందన్నారు. ఇప్పటికే పీహెచ్‌సీల్లో అత్యవసర సేవలు మినహా ఓపీ సేవలను బంద్ చేయడం జరిగిందన్నారు. ఈ నిరసనలో అధిక సంఖ్యలో పీహెచ్‌సీ వైద్యులు పాల్గొన్నారు.

పెద్దలకు భయపడి ప్రాణాలు తీసుకున్నారు

ప్రేమ జంట ఆత్మహత్యతో దుర్గాడలో విషాదఛాయలు


ఘటన స్థలంలో దర్యాప్తు చేస్తున్న పోలీసులు


మృతుడు అశోక్


దీప్తి

పిఠాపురం: గొల్లప్రోలు మండలం దుర్గాడ గ్రామానికి చెందిన యువతీ యువకుల ఆత్మహత్యతో ఆ గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. పెద్దలు తమ ప్రేమను ఒప్పుకోరన్న అనుమానంతో వారు ఈ అఘాయిత్యానికి ఒడిగట్టినట్టు తెలుస్తోంది. ఉద్యోగం వస్తే ఇద్దరం ఒకటవ్వాలని ఎన్నో కలలు కన్న వారి ఆశలను ఎవరైనా తుంచేస్తారేమోనని భావించి పోతే కలిసే పోవాలనుకున్నారో ఏమో.. కలసికట్టుగా నిర్ణయం తీసుకుని తనువు చాలించారు. దుర్గాడకు చెందిన గొల్లపల్లి దీప్తి (17)ని కొమ్మూరి అశోక్ (25) అనే యువకుడు సామర్లకోటలో గొంతు కోసి చంపి, అనంతరం తాను సైతం ఆత్మహత్య చేసుకున్న ఘటనతో బుధవారం దుర్గాడలో కలకలం రేపింది. సామర్లకోట పోలీసులు, మృతుల బంధువులు తెలిపిన సమాచారం మేరకు అశోక్‌కు తల్లి, తండ్రి, అక్క ఉండగా దీప్తికి తల్లి, తండ్రి, తమ్ముడు ఉన్నారు. దీప్తి ఇంటర్ చదువుతుండగా అశోక్ ప్రైవేటు కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు. వీరిద్దరూ పేద కుటుంబాలకు చెందిన వారే.

కులాంతర ప్రేమే ప్రాణాలు తీసిందా?

ఆ యువతీ యువకులిద్దరూ కొంత కాలంగా ప్రేమలో ఉన్నట్లు సమాచారం. అశోక్‌కు 20 రోజుల క్రితం చెన్నైలో ఒక ప్రైవేటు కంపెనీలో ఉద్యోగం వచ్చింది. ఉద్యోగంలో చేరి దసరాకు సెలవుపై మంగళవారం తన స్వగ్రామం దుర్గాడ వచ్చాడు. దీప్తి సైతం సెలవుల సందర్భంగా కాకినాడలో తన పెద్దమ్మ ఇంటికి వెళ్లింది. మంగళవారం రాత్రి తన బంధువులతో కలిసి కాకినాడలో షాపింగ్‌కు వెళ్లిన దీప్తికి తన అక్క ఫోన్‌కు అశోక్ మెసేజ్ చేసినట్టు తెలిసింది. దీంతో ఆమె తన స్నేహితురాలి నుంచి మెసేజ్ వచ్చిందని, వెళ్లి వస్తానంటూ కాకినాడలో తన కూడా వచ్చిన వారికి చెప్పి వెళ్లింది. అయితే ఎంత సేపటికీ ఆమె తిరిగి రాకపోవడంతో కంగారు పడిన ఆమె బంధువులు ఆమె కోసం గాలించారు. ఇదే సమయంలో అశోక్ తాను చనిపోతున్నానంటూ తన బంధువులకు ఫోన్ చేసి చెప్పాడు. దీంతో వారంతా అతని కోసం గాలింపు ప్రారంభించారు.

అతని సెల్ స్విచ్ ఆఫ్ వారంతా కంగారు పడ్డారు. బుధవారం ఉదయానికి వారిద్దరు మృతి చెందినట్లు సామర్లకోట పోలీసులు ద్వారా సమాచారం అందింది.

కాగా కొంత కాలంగా వీరు ప్రేమించుకుంటున్నట్టు చెప్తున్నారు. తనకు ఉద్యోగం వస్తే పెళ్లి చేసుకోవచ్చని నిర్ణయించుకున్నారని, ఈ నేపథ్యంలో అశోక్‌కు ఉద్యగం రావడంతో పెళ్లి ప్రసక్తి తీసుకురాగా ఇద్దరివీ వేరే సామాజిక వర్గాలు కావడంతో ఇంటి దగ్గర వారు ఒప్పుకోరన్న భయంతో ఈ అఘయిత్యానికి ఒడిగట్టి ఉంటారని పోలీసులు భావిస్తున్నారు.




బాలాత్రిపురసుందరిగా...

ఖండపుత్ర వధోద్యుక్త 'బాలా'విక్రమ నందితా బ్రహ్మాండపురాణం లోని లలితా సహస్రంలో 'బాలా' పేరు కానవస్తుంది. పదేళ్లలోపు పిల్లలకు పూజలు చేయడం ఆచారం. పాడ్యమిలో బాలాగా అలంకరిస్తారు.

అమ్మవు నీవే.. అఖిల జగాలకు..

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): అయిగిరి నందని, నందితమోదిని.. విశ్వవినోదిని నందినుతే.. అంటూ ఆ కనకదుర్గమ్మను భక్తులు కొలిచారు. శరన్నరాత్ర ఉత్సవాలు చివరి దశకు చేరుకున్నాయి. బుధవారం అమ్మవారు మహిషాసురమర్దినిగా భక్తులకు దర్శనమిచ్చారు. దేవీ ఆలయాల్లో అమ్మవారిని దర్శించుకోవడానికి భక్తులు పోటెత్తారు. రాజమహేంద్రవరంలోని దేవీచౌక్‌లో బాలా త్రిపురసుందరీదేవి అమ్మవారు శ్రీమహిషాసురమర్దినిగా భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారిని దర్శించుకోవడానికి వేలాదిగా బారులు తీరారు. భవానీ దీక్ష చేసిన భవానీలు విజయవాడ దుర్గమ్మను దర్శించుకోవడానికి బయలుదేరారు. తొలుత దేవీచౌక్‌లోని అమ్మవారిని దర్శించుకున్నారు. ఇక్కడ ఉదయం జరిగిన కుంకుమ పూజల్లో వేలాదిగా భక్తజనం పాల్గొంది. అలాగే నగరంలో పలు ఆలయాల్లో అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించి, పూజలు, అభిషేకాలు చేశారు.



వాసవీ కన్యకా పరమేశ్వరీదేవి దేవాలయంలో అమ్మవారు



దేవీచౌక్‌లో బాలాత్రిపుర సుందరీదేవి అమ్మవారికి పూజలు చేస్తున్న కమిటీ సభ్యులు



గాయత్రిగా...

విదియ నాడు అమ్మవారిని గాయత్రిగా అలంకరించి, కుంకుమ పూజలు చేస్తారు. 'గాయత్రీ' వ్యాహృతిః సంధ్యా నిజబృంద నిషేవితా..' అమ్మవారికి ఈ నామాలు లలితాసహస్ర నామాల్లో కానవస్తాయి.



అన్నపూర్ణగా...

'అన్నపూర్ణే సదాపూర్ణే శంకరప్రాణ వల్లభే జ్ఞానవైరాగ్య సిద్ధ్యర్థం భిక్షాం దేహి చ పార్వతీ'. మన క్షుద్బాధ తీర్చడమే కాకుండా, జ్ఞానవైరాగ్యాలను ప్రసాదిస్తుందని శ్లోకార్థం. చవితి రోజున అలంకారమిది.



కాత్యాయనిగా..

'కాత్యాయని మహామాయే మహాయోగిన్యధీశ్వరి। నంద గోప సుతం దేవిం పతియే కురుతే నమః॥' అంటే తేజో స్వరూపిణి, మహాతేజో పుంజం. నాలుగో రోజు అమ్మ రూపం కాత్యాయని.



మహాలక్ష్మిగా...

యా దేవీ సర్వభూతేషు లక్ష్మీరూపేణ సంస్థితా అని చండీ సప్తశతిలో ఒక శ్లోకం అమ్మవారిని లక్ష్మీదేవిగా వర్ణిస్తుంది. తదియ నాడు నాణేలు, కరెన్సీ నోట్లతో అమ్మవారిని అలంకరిస్తారు.



లలితా త్రిపురసుందరిగా...

'శ్రీశివా శివశక్త్యైక్య రూపిణీ లలితాంబికే' లలితా సహస్ర నామాల్లో చివరిగా కానవచ్చే పేర్లు. పంచమి తిథినాడు అమ్మవారిని లలితగా అలంకరించి, అల్లం గారెలు నివేదిస్తారు.



మహాచండిగా..

'ఓం జయన్త్యేశ్వరిమహాచండీ మహామాయేశ్వరిమహాశక్తి। దుర్గా మహిమా స్వరూపిణి సర్వదుఃఖహారిణి నమోస్తు॥' శరన్నవరాత్ర మహోత్సవాల్లో ఏడో రోజున శ్రీమహాచండీగా దర్శనమిస్తారు.



సరస్వతిగా...

'సరస్వతీ నమస్తుభ్యం వరదే కామరూపిణి' మూలానక్షత్రం కావడంతో అమ్మవారిని సరస్వతీదేవిగా అలంకరిస్తారు. చిన్నారులకు అక్షరాభ్యాసాలతో విద్యాబుద్ధులు అబ్బుతాయని విశ్వాసం.



దుర్గాదేవిగా...

'దుర్గేస్మృతా హరసి భీతిమశేషజన్తోః స్వస్థైః స్మృతా మతి మతీవ శుభాం దదాసి' శ్లోకం మార్కండేయ పురాణాంతర్గతమైన దుర్గాసప్తశతిలో కానవస్తుంది. అష్టమి తిథినాడు అమ్మను దుర్గగా ఆరాధిస్తారు.



మహిషాసురమర్దినిగా...

'జయజయహే మహిషాసురమర్దిని రమ్యకపర్దిని శైలసుతే'. మహర్నవమిన అమ్మవారిని మహిషాసురమర్దినిగా అలంకరిస్తారు. దానిమ్మ, బత్తాయి, నారింజ పండ్లు, ఎర్రచందన అక్షతలతో పూజలు చేస్తారు.



రాజరాజేశ్వరిగా...

'చిద్రూపీ పరదేవతా భగవతీ శ్రీరాజరాజేశ్వరీ' అంటూ శ్రీ రాజరాజేశ్వరీ అష్టకంలో అమ్మవారిని స్తుతిస్తాం. ఉత్సవాల్లో చివరిదైన 11వ రోజున తల్లి శ్రీరాజరాజేశ్వరీదేవిగా దర్శనమిస్తారు.